

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం | 07.05.2024 | హైదరాబాద్




- జరిగిన అభివృద్ధి, నెరవేరని హామీల నడుమ ఎన్నికల పర్వం
- పదేళ్ల పాలన తీరుతో ప్రత్యర్థులను ఎదుర్కొంటున్న బీఆర్ఎస్
- ప్రజా సంక్షేమమే తమ అజెండా అంటున్న మాజీ ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి

మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల పర్వం రసవత్తరంగా సాగుతున్నది. పదేళ్లు కేసీఆర్ చేసిన అభివృద్ధి, నెరవేరని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇన్నాళ్లు తెలంగాణకు ఏం చేశారో కూడా చెప్పుకోలేని బీజేపీల అభ్యర్థులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ హోం గ్రౌండ్‌లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పి. వెంకట్రామిరెడ్డి దూసుకుపోతున్నారు. వాడీవేడిగా సాగుతున్న ఈ ఎన్నికల ప్రక్రియలో.. రెండు జాతీయ పార్టీలను మట్టికరిపించడమే లక్ష్యంగా విస్తృతంగా బీఆర్ఎస్ ప్రచారం సాగిస్తోంది. ఈ స్థానంలో బీఆర్ఎస్ గెలుపు అనివార్యమే అన్నట్లుగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు ప్రచారంలో శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలను తనదైన శైలితో ఎండగడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మాజీ కలెక్టర్, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. - విశాలభారతి / మెదక్

## ప్రచారంలో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి
# దూకుడు



### స్వరాష్ట్రంలో సమన్యాయం..

స్వరాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేస్తూ బీఆర్ఎస్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఓవైపు, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు మరోవైపు అన్నట్లుగా మెదక్ పార్లమెంట్ స్థానంలో ఎన్నికల ప్రచారం జరుగుతోంది. మూడు ప్రధాన పార్టీలు ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో..... అధికారం కోసం బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యర్థులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అధికారం చేజారకుండా గెలుపు కోసం వెంపర్లాడుతున్నారు. ఆరు గ్యారంటీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా... ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కానీ హామీలు, పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం అందించిన సంక్షేమ ప్రయోజనాల ముందు నిలవలేకపోతున్నాయంటున్నారు రాజకీయ విశ్లేషకులు. అసలు తెలంగాణకు మోదీ సర్కార్, బీజేపీ నాయకుడు ఏం చేశాడో, ఏం చేస్తారో చెప్పుకోలేక నానా తిప్పలు పడుతున్నారు.

### నెరవేరిన ఆకాంక్షలు వర్సెస్ అమలు కాని హామీలు..

ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ అమలు చేసిన అభివృద్ధి కార్యాచరణతో నెరవేరిన ఆకాంక్షలు వర్సెస్ అమలు కానీ హామీలతో గాడిద గుడ్డు ప్రచారాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్ పార్టీ, పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు తెలంగాణ ప్రజలకు చేసిందేమి చెప్పుకోలేక ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికీ అమలు కానీ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ప్రతిష్టాత్మకమైన ఐఐఎం, ఐటీఐఆర్, కాళేశ్వరం జాతీయ హోదా వంటి ఎన్నో అత్యంత కీలకమైన హామీలను నీరుగార్చిన కేంద్ర సర్కారుకు ఈ ఎన్నికల్లో చుక్కెదురు అవుతున్నది. ఇలా మెదక్ పార్లమెంట్ పరధిలో సాగు, తాగునీటి ప్రాజెక్టులను బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో ప్రత్యర్థులు ప్రచారంలో వెనకబడిపోతున్నారు. అమలు కానీ హామీలనే ప్రధానా అస్త్రాలుగా మార్చుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి దూసుకుపోతుండగా... మోదీయే ప్రధాన అజెండగా బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు జనాల్లోకి వెళ్తున్నారు. అదే సమయంలో ఆరు గ్యారంటీలు, రేవంత్ రెడ్డి ఛరిస్మానే తన ప్రచారాస్త్రాలు అన్నట్లుగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసి మూడో స్థానం కూడా దక్కని నీలం మధు ముందుకు సాగుతున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థిగా వ్యవహారించిన నీలం మధు... లోక్ సభ ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ చేయడం స్థానిక నేతలను కలవరపెడుతుంది. ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన కాటా శ్రీనివాస్ గౌడ్, దామోదర రాజనర్సింహ వర్గానికి ఇదే మిగుడు పడటం లేదు. అయితే జగ్గా రెడ్డి అండదండలతో కాంగ్రెస్ పార్టీలో చేరిన నీలం మధుకు ఇప్పటికీ పూర్తి స్థాయి సహకారాన్ని పొందలేకపోతున్నారు. ఇక మోదీయే తమ ప్రచారాగా బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు పదేళ్ల కాలంలో తెలంగాణ విషయంలో నెరవేరని హామీలే సమస్యగా మారుతున్నాయి. ఇటీవల జరిగిన ఓ టీవీ ఇంటర్వ్యూలోనూ బీజేపీ నెరవేర్చని హామీల విషయానికే సమాధానం చెప్పుకోలేక తడబడ్డటం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ప్రజాపాలనే ప్రచారాస్త్రంగా బీఆర్ఎస్..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఈ క్రమంలో గెలుపే లక్ష్యంగా అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలో నిలిపింది. ముఖ్యంగా మెదక్ విషయంలో ఆచితూచి అడుగులు వేసిన బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్... ప్రధాన పార్టీలను నిలవరించేలా వెంకట్రామిరెడ్డిని ఎంపిక చేసి ఎన్నికల వ్యూహాన్ని అమలు చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తృతమైన ప్రజాసంబంధాలు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా ఆచరణలోకి తీసుకువచ్చిన మాజీ ఐఏఎస్ వెంకట్రామిరెడ్డితో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అభ్యర్థి ప్రకటనతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను బీఆర్ఎస్ నిలవరించిందనే వాదనలు ఉన్నాయి. ఎన్నికల్లోనూ అదే స్థాయిలో సత్తా చాటేలా ప్రచారం చేస్తున్నది. ఇప్పటికే మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లోని ఒకటి మినహా అన్ని స్థానాల్లో మంచి మెజార్టీకి సాధించే బీఆర్ఎస్ కృషి చేస్తున్నది. కాంగ్రెస్ గెలిచిన మెదక్ స్థానంలో తన ప్రాతినిధ్యం పెంచుకునేలా ప్రచారం చేస్తున్నది. ఆరు నెలల కాంగ్రెస్ పాలన, పదేళ్ల మోదీ ప్రగల్భాలను ఎండగడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధితో ప్రజాపాలనయే తమ అజెండా అన్నట్లుగా బీఆర్ఎస్ ప్రచారంలో ముందుకు సాగుతున్నది.





### ఆ పార్టీలను నమ్మితే మోసపోతారు..

**- వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి**

నయవంచన హామీలతో, అమలుకానీ ఆరు గ్యారంటీలతో గారడీ చేసిన కాంగ్రెస్ ఆరు నెలల పాలనను నమ్మి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇవాళ కేంద్రంలో ఉన్న మోదీ సర్కారు తెలంగాణ ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వకుండా ఓట్ల కోసమే ఇక్కడ ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి పార్టీలకు ఓటేస్తే తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, ఆస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, ప్రజా సేవయే ప్రధాన అజెండాగా పనిచేసిన నాలాంటి ప్రభుత్వ ఉద్యోగిని నిలువరించేందుకు బీజేపీ, కాంగ్రెస్ గోబెల్ ప్రచారాన్ని ఎత్తుకున్నాయి. తన గెలుపుతో నియోజకవర్గ అభివృద్ధితోపాటు, నియోజకవర్గ ప్రజలకు అండగా, ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తాను. దీనికోసం బీఆర్ఎస్ పార్టీని నిలవరించేందుకు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటూ హుందాగా వ్యవహారించాల్సిన రేవంత్ రెడ్డి... అడ్డగోలు మాటలతో ఎదురు దాడి చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్, దేశానికి ప్రాతినిధ్యం వహించిన బీజేపీలను మరోసారి నమ్మి ఓటేయెవద్దు.









